
ఈనాడు
నారాయణపేట
సోమవారం ఆగస్టు 31, 2026

నమ్మితే.. ముంచేస్తారు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే: కోస్గి పట్టణంలోని ఓ కళాశాల అధ్యాపకుడికి చెందిన చరవాణిని ఓ సైబర్ కేటుగాడు హ్యాక్ చేశాడు. అందులో ఎక్కువసార్లు.. నిత్యం డయల్ చేసిన నంబర్లను ఎంపిక చేసుకున్నాడు. 'నేను మీ ఫ్రెండ్‌ను నాకు రూ.15 వేల డబ్బు అవసరం. మీకు 2 లేక 3 గంటల్లో తిరిగి పంపిస్తాను' అని పలువురికి చరవాణిలో వాట్సప్ ద్వారా సందేశం పంపడంతో.. కొందరు ఆ సందేశం నిజమని నమ్మి డబ్బులు పంపారు. కొంత సమయానికి ఆ అధ్యాపకుడు జరిగిన విషయం తెలుసుకున్నారు. తన చరవాణి హ్యాక్ అయిందని, ఎవరూ తనకు డబ్బులు పంపవద్దని మిత్రుల ద్వారా సమాచారం చేరవేశారు.



సైబర్ మాయగాడి నుంచి వచ్చిన వాట్సప్ సందేశాలు

సైబర్ నేరగాళ్లు కొత్తకొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతుంటారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు అంటారు. చరవాణి హ్యాక్ చేసి రెగ్యులర్‌గా కాంటాక్ట్ లిస్ట్‌లో ఉండే నంబర్లను ఎంపిక చేసుకొని.. నేను మీ స్నేహితుడిని.. మీ శ్రేయోభిలాషిని.. నాకు అత్యవసరంగా డబ్బు అవసరం ఉంది. రెండు, మూడు గంటల్లో మీ డబ్బు తిరిగి పంపిస్తాను.. నాకు ఫోన్‌పే గానీ.. గూగుల్ పే గానీ వెంటనే కొంత డబ్బు పంపించడని వాట్సప్‌ల్లో సందేశం పంపిస్తారు. ఆ సందేశం నమ్మి డబ్బులు పంపారో ఇక అంతే సంగతులు.

జాగ్రత్త పడాలి..: వాట్సప్‌ల్లో వచ్చే సందేశాలను నమ్మి ఎవరూ కూడా డబ్బులు పంపొద్దు. ముందుగా నిజమా? కాదా? అవసరం ఉందా? లేదా? అని నిర్ధారణ తర్వాత డబ్బులు పంపాలి. నిర్ధారణ లేకుండా కేవలం మెసేజ్‌ల ద్వారా డబ్బులు పంపవద్దు. అప్రమత్తంగా లేకుంటే సైబర్ కేటుగాళ్లు మోసగిస్తారు. **- సైదులు, సీఐ, కోస్గి**


రక్షణ దిమ్మెలు లేక ప్రమాదకరంగా ఉన్న కరకట్ట

ఆహ్లాదం కారాదు.. విషాదం

అలంపూర్ జోగులాంబ ఆలయాల సమీపంలోని తుంగభద్రకు శ్రీశైలం వెనక జలాలు రావడంతో నది నిండుకుండలా మారింది. ఆలయాలు, పట్టణం రక్షణ కోసం ఏర్పాటు చేసిన కరకట్టకు రెండు వైపుల ఉన్న దిమ్మెలు ధ్వంసం కావడంతో ప్రమాదకరంగా మారింది. నది దృశ్యాలు తిలకించేందుకు భక్తులు కట్టపైకి వెళ్తున్నారు. కొందరు యువకులు కట్ట పైనుంచి నదిలోకి దూకుతూ ఈత కొడుతున్నారు. ఈతరాని పిల్లలు సైతం దానిపైకి వెళ్లి కూర్చుంటున్నారు. అదుపుతప్పితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు కరకట్టపై దిమ్మెలు ఏర్పాటు చేయాలని భక్తులు, పట్టణవాసులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అలంపూర్**



గోల్కొండ కోటకు విహార యాత్ర..

నర్వ మండలంలోని సీపూరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆదివారం విహార యాత్రలో భాగంగా హైదరాబాద్‌లోని గోల్కొండ కోట సందర్శించారు. చార్మినార్, ట్యాంక్‌బండ్, శంషాబాద్ ఎయిర్‌పోర్టు తదితర ప్రదేశాలు తిలకించారు. హెచ్ఎం జనార్దన్, సీఆర్పీ నర్సింహులు, ఉపాధ్యాయులు నవీన్, ఈశ్వర్ పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, నర్వ**

పొగతో ఇబ్బందులు..

మక్తల్ మండలంలోని గోలపల్లి స్టేజీ సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఓ గుత్తేదారు డాంబర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దీని నుంచి వచ్చే పొగతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని బాటసారులు, వాహనదారులు వాపోతున్నారు. ప్లాంట్‌ను మరో చోటికి మార్చాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. **- మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే**



వరుస కడుతున్న కూలీలు

కృష్ణా నదీతీరంలో సాగు పనులకు రాక

కృష్ణా, న్యూస్‌టుడే: ఒకప్పుడు ఉమ్మడి పాలమూరు జిల్లా అంటే.. వలసలు గుర్తుకు వచ్చేది.. ముంబయి, పుణెతోపాటు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లడం ఒకప్పటి చరిత్ర.. కానీ నేడు ఆ వలస జిల్లాకే ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు వస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కోసిగి పక్కన ఉన్న పలు గ్రామాల నుంచి నారాయణపేట జిల్లాలోని కృష్ణా గ్రామానికి రైలులో వస్తున్నారు. అక్కడ నుంచి వ్యవసాయ పనులు ఉన్న చోటకు ట్రాక్టర్లు ఇతర ప్రైవేటు వాహనాల్లో వెళ్తున్నారు. రోజూ బెంగళూరు-నాందేడ్ రైలులో వచ్చి తిరిగి అదే రైలులో సాయంత్రం తిరిగి స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. కృష్ణా నదీతీరంలోని తంగడిగి, హిందుపూర్, కున్సి, కుసుమర్తి, అయినాపూర్ గుడేబల్లూర్ ప్రాంత రైతులు రైల్వేస్టేషన్‌కు వచ్చి ఎవరికి ఎంత మంది కావాలో అంతమందిని ప్రైవేటు వాహనాల్లో తీసుకువెళ్లి తిరిగి సాయంత్రం రైలు వచ్చే సమయానికి కృష్ణా రైల్వేస్టేషన్‌లో దిగబెడతారు.


కృష్ణా రైల్వేస్టేషన్ బయట పని కోసం నిల్చున్న కూలీలు

రోజు 300 నుంచి 400 మంది..: ప్రతీ రోజూ కృష్ణా రైల్వేస్టేషన్ వద్దకు 300 నుంచి 400 మంది కూలీలు వస్తుంటారు. పని దొరకని వారు సాయంత్రం వరకు కృష్ణా రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఉండి తిరిగి వెళ్లిపోతుంటారు. కాగా రైల్వేస్టేషన్ సమీపంలో కల్లు దుకాణం ఉండటంతో పలువురు కల్లుకు అలవాటు పడి పనులు చేసుకోలేక పోతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. కల్లు తాగి రైలు ప్రమాదాల బారిన పడి మృతి చెందిన వారు కూడా ఉన్నారు. రైలులో వచ్చే కూలీలు తమ రైల్వేస్టేషన్‌లో ఎక్కి ఏ బోగీ ఖాళీగా ఉంటే అందులో కూర్చుని, లేదా నిల్చొని ప్రయాణిస్తారు. ఏదైనా ప్రమాదం జరిగి మృతి చెందితే ఎవరు మృతి చెందారన్నది కూడా తెలియని పరిస్థితి నెలకొంది. రైల్వే అధికారులు స్పందించి ఈ ప్రాంతానికి వచ్చే కూలీలకు సీజన్ పాస్‌లు తీసుకునేలా అవగాహన కల్పించి పాస్‌లు ఇప్పిస్తే మేలు కలుగుతుంది. అలాగే రైలులో కల్లు తాగి ప్రయాణించే వారిని గుర్తించి అప్రమత్తం చేయాలని లేదా, రైల్వేస్టేషన్ పరిధిలో కల్లు విక్రయాలు నిషేధించాలని స్థానికులు కోరుతున్నారు.

మన్‌కీ బాత్‌తో నైతిక విలువలు పెంపుదల

ధన్వాడ, న్యూస్‌టుడే: ప్రధాని మోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణ ఆదివారం ధన్వాడ నుంచి హాజరయ్యారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు సుంకు ఉమేష్‌కుమార్ ఇంటి ఆవరణలో ప్రత్యేకంగా డిజిటల్ తెర ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని తిలకించారు. రాష్ట్ర నాయకులు రతంగ్‌పాండురెడ్డి, గోవర్ధన్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, సీనియర్ నాయకులు నర్సన్‌గౌడ్, పి.రాంచంద్రయ్య, ఉదయభానుతోపాటు ధన్వాడ, మరికల్, నారాయణపేట మండలాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ విద్యార్థులు, యువకుల్లో నైతిక విలువలు పెంపుదలకు, నిర్దేశించుకున్న లక్ష్యం దిశగా అడుగులు వేసేందుకు ప్రధాన మంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.


ధన్వాడలో పార్టీ శ్రేణులతో కలిసి మన్‌కీ బాత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ డీకే అరుణ

హిందువులను సంఘటితం చేయడమే లక్ష్యం: వీహెచ్‌పీ

ఊట్కూరు, న్యూస్‌టుడే: సమాజంలో హిందువులను సంఘటితం చేయడమే లక్ష్యంగా విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) జిల్లా కార్యదర్శి కన్నా శివకుమార్ అన్నారు. మండలకేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్ వద్ద ఆదివారం నిర్వహించిన వీహెచ్‌పీ ప్రఖండ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వచ్చే నెలలో 4 నుంచి 11 వరకు చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే: పదవులు ఎవరికి శాశ్వతం కాదని అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఆదివారం జౌళాపురం గ్రామానికి చెందిన భాజపా మద్దతుతో గెలిచిన సర్పంచి మహాదేవమ్మ, ఉపసర్పంచి చిన్న హన్మంతు, వార్డు సభ్యులు మంత్రి వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి కడువావేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదవులు శాశ్వతం కాదని అభివృద్ధే శాశ్వతం అన్నారు. అందరి భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం అన్నారు. రాజకీయాలకు తావులేకుండా ప్రతి గ్రామానికి సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. మనలో మనం గొడవ పడకూడదన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. గత భారాస హయాంలో డబుల్ బెడ్‌రూం పేరిట ఆశ చూపించారు తప్ప.. ఒక్క ఇల్లు కట్టించలేదన్నారు. రూ.276 కోట్లతో 5,500 ఇందిరమ్మ ఇళ్లు నియోజకవర్గానికి మంజూరైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, గణేష్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, బాలకృష్ణ, బాల్‌రెడ్డి, బాలకిష్టయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


సర్పంచి మహాదేవమ్మకు కండువా కప్పుతున్న మంత్రి వాకిటి

అత్యాపత్య పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రతిభ

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అత్యాపత్య అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలబాలికల పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో హైదరాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలవగా, బాలికల్లో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాలురలో.. నాగర్‌కర్నూల్ తృతీయ స్థానంలో నిలిచింది. నిర్వాహకులు క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమానికి అతిథులుగా శేఖర్, లక్ష్మణ్, పోశెట్టి, బ్రహ్మయ్య, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వన్నెల భూమన్న, సంజీవ్ హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరులో జమ్మూకశ్మీర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. రాష్ట్ర పరిశీలకుడు పరమేశ్వర్, బాధ్యులు అజయ్, అమర్‌సింగ్, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



జూనియర్స్ బాలికల్లో విజేతగా నిలిచిన నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు క్రీడాకారిణులు

ఆర్టీసీ వైపే మహిళల చూపు 6లో..

సీఎంఆర్ ఎగవేత.. భారీగా మేత

- టాప్ 20లో జిల్లా మిల్లులు!
- రంగంలోకి దిగిన ఈడీ

పెబ్బేరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి తీసుకొన్న ధాన్యంలో బియ్యం రూపకంగా (సీఎంఆర్) తిరిగి ఇచ్చే విషయంలో జిల్లా మిల్లర్ల యజమానులు రాష్ట్ర స్థాయిలో భారీ ఎగవేతదారుల జాబితా(టాప్ 20)లో చోటు దక్కించుకోవడం సంచలనంగా మారింది. పౌర సరఫరాల శాఖ అధికారుల హెచ్చరికలను ఏమాత్రం లెక్క చేయని వీరిపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కన్ను పడింది. జిల్లాలోని మూడు ప్రధాన బియ్యం మిల్లులకు నోటీసులు జారీ చేసినట్లు జిల్లాలో చర్చనీయాంశమైంది.



రూ.470 కోట్లలో.. రూ.40 కోట్లు రికవరీ

- 2022- 2023 యాసంగికి సంబంధించిన టెండర్ ధాన్యంలో జిల్లాలోని బియ్యం మిల్లర్లు రూ.470 కోట్లు విలువ గల ధాన్యం ప్రభుత్వం నుంచి తీసుకున్నారు. బాగాలేదని చెబుతూ.. కేటాయించిన ధాన్యాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటించారు.
- ప్రభుత్వానికి భారీగా చెల్లించాల్సిన వాటిలో మూడు బియ్యం మిల్లులు ఉన్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారి ఆంజనేయులు తెలిపారు. కొత్తకోట మండలం మహాలక్ష్మి ఇండస్ట్రీస్ రూ.34 కోట్లు, వనపర్తి మండలం రిలిక్ బియ్యం మిల్లు నుంచి రూ.31 కోట్లు, శ్రీరంగాపూర్ మండలంలోని అల్ అజీజ్ బియ్యం మిల్లు రూ.31 కోట్లు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు.
- టెండర్ ధాన్యం 110 బియ్యం మిల్లులకు కేటాయించగా.. 18 మిల్లులు పూర్తిగా చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఇంకా 92 మిల్లులు చెల్లించాల్సి ఉంది.
- 2022- 2023 యాసంగి సీజన్‌కు చెందిన ధాన్యంలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన నాలుగు బియ్యం మిల్లులు 50 శాతం చెల్లించారు. వీటిలో సప్తగిరి, లక్ష్మీనర్సింహ, సింధు, శిర్డీ సాయి బియ్యం మిల్లులు 50 శాతం నగదును చెల్లించినట్లు అధికారులు తెలిపారు. మిగతావి 20 శాతం నుంచి 30 శాతం వరకు చెల్లించారు. రూ.470 కోట్లలో రూ.40 కోట్లు చెల్లించగా.. రూ.430 కోట్లు బకాయి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

నిఘా: కొరవడిన పర్యవేక్షణ

గడువు ముగిసినా.. సీఎంఆర్ చెల్లించని మిల్లులకు మళ్లీ ఎందుకు ధాన్యం కేటాయించారనేది ప్రశ్నార్థకంగా మారింది. కొల్లగొట్టిన ప్రజాధనాన్ని రికవరీ చేయడంలో.. బినామీ ఆస్తులను ప్రభుత్వం జప్తు చేయడంలో పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో పని చేసిన వారు యజమానులకు పూర్తి స్థాయిలో సహకరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈడీ నేరుగా రంగంలోకి దిగి సోదాలు నిర్వహించి అక్రమార్కుల ఆస్తులను అటాచ్ చేసుకునే విధంగా ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

వారంలో రూ.వంద కోట్లు వసూలు చేస్తాం.. బియ్యం మిల్లుల యజమానులకు ప్రభుత్వం అవకాశం కల్పించినా.. వారు సద్వినియోగం చేసుకోలేదు. వారం రోజుల్లో రూ.వంద కోట్లు రికవరీ చేస్తాం. ప్రతి ఒక్క మిల్లు నుంచి వసూలు చేస్తాం. ఉన్న బకాయిల్లో సోమవారం లోగా చెల్లిస్తే 50 శాతం, సెప్టెంబరు చివరి నాటికి చెల్లిస్తే 75 శాతం, అక్టోబరు చివరి నాటికి చెల్లిస్తే వంద శాతం చెల్లించాలనే ఆదేశాలు ఉన్నాయి. యజమానులు ఏ అవకాశం కోరుకుంటే అదే కల్పిస్తాం. **- ఆంజనేయులు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి**

విధుల్లో మానసిక ఆరోగ్యం కీలకం

నారాయణపేట, న్యూస్‌టుడే: విధుల నిర్వహణలో మానసిక ఆరోగ్యం కీలకమని ఎస్పీ డా.వినీత్ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజా నుంచి గచ్చిబౌలి స్టేడియం వరకు నిర్వహించిన 21 కి.మీటర్ల హాఫ్ మారథాన్ రన్నింగ్ పోటీలో ఎస్పీ డా.వినీత్, డీసీఆర్బీ డీఎస్పీ మహేశ్ పాల్గొని విజయవంతంగా పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మారథాన్‌లో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆరోగ్యం, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మారథాన్‌కు హాజరై 21 కి.మీటర్ల పరుగు పూర్తి చేసినట్లు ఎస్పీ వివరించారు.

ఆట ఆడితే.. పతకమే


ఫుట్‌బాల్ గోల్‌కీపర్‌గా రాణిస్తున్న తండా చిన్నోడు

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: చిన్నప్పటి నుంచి సాకర్ ఆటంటే అతనికి ఇష్టం. నిరంతర సాధనతో గురుకులంలో ఆ కల సాకారం చేసుకున్నారు. ఫుట్‌బాల్ గోల్‌కీపర్‌గా ప్రత్యర్థి జట్టు గోల్ చేయకుండా అడ్డుగోడలా నిలుస్తున్నారు. వారి ఆట కట్టిస్తున్నారు. ఇలా ఆడుతూ జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగారు. అతనే ధన్వాడ మండలం మేకబండతండాకు చెందిన మేఘావత్ రోహిత్. ప్రస్తుతం కొండాపూర్ గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. బెంగళూరులో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి జూనియర్స్ ఫుట్‌బాల్ టోర్నీలో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.


మెఘావత్ రోహిత్

శిక్షకుడి ప్రోత్సాహంతో..: గురుకులంలో చదువుకుంటున్న రోహిత్ మూడేళ్లుగా శిక్షకుడు కల్యాణ్ ప్రోత్సాహంతో ఫుట్‌బాల్‌లో ఆరితేరారు. జట్టులో గోల్ కీపర్ స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. తల్లిదండ్రులు సైతం వెన్నుతట్టడంతో ఇప్పటి వరకు నాలుగు రాష్ట్రస్థాయి టోర్నీలు, ఒక జాతీయ స్థాయి టోర్నీ ఆడి రెండో జాతీయ స్థాయి పోటీకి ఎంపికై ఆడుతున్నారు. హైదరాబాద్‌లో సుబ్రతో ముఖర్జీ టోర్నీ, హకీంపేటలో సీఎం కప్ టోర్నీ, నల్గొండలో ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి టోర్నీ, హైదరాబాద్‌లో మరో రాష్ట్రస్థాయి పోటీలో, మేలో చెన్నైలో నిర్వహించిన జాతీయ స్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో సత్తా చాటారు.

నిండా మొక్కలు.. నీరు రాక చిక్కులు



సాగునీటిని అందించే ఆర్డీఎస్ ఉప కాల్వలు అధ్వానంగా మారడంతో అరకొర నీరొచ్చినా అందని పరిస్థితి నెలకొంది. మాన్‌దొడ్డి, పెద్ద ధన్వాడ, పచ్చర్ల, తుమ్మిళ్ల, అశోక్‌నగర్, రాజోలి గ్రామాల్లో ఆర్డీఎస్ కాల్వ ప్రధాన డిస్ట్రిబ్యూటర్ల కింద వివిధ రకాల ఉప కాల్వలున్నాయి. వాటి నిర్వహణ లేకపోవడంతో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి సాగునీటిపారుదలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికే నీరు లేక పంటలకు గడ్డుకాలం ఉండగా, రానున్న రోజుల్లో నీరొచ్చినా గడ్డి, పిచ్చిమొక్కల కారణంగా అందే పరిస్థితి లేకుండా పోతోందని రైతులు వాపోతున్నారు. **-న్యూస్‌టుడే, రాజోలి**

అసంపూర్తి పనులతో అవస్థలు



పుర పరిధిలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో అదనపు గదుల నిర్మాణాలు చేపట్టడానికి దాదాపుగా ఆరు సంవత్సరాల కిందట పనులు ప్రారంభించారు. సంబంధిత గుత్తేదారుడు స్లాబ్ వేసి గోడల నిర్మాణాలు చేపట్టకుండా వదిలేసి వెళ్లిపోయాడు. ప్రస్తుతం ఒకే గది ఉండటంతో చిన్నారులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, కందనూలు**

పట్టుబట్టు.. గోల్ కొట్టు



సెలవొస్తే చాలు జడ్చర్ల మినీ స్టేడియం కిటకిటలాడుతుంటుంది. వయసుతో సంబంధం లేకుండా వివిధ రకాల క్రీడలు సాధన చేస్తుంటారు. ఆదివారం పిల్లల నుంచి 50 ఏళ్ల వయసున్న వారు ఫుట్‌బాల్ ఆడటం ఆకట్టుకుంది. ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి వారం సాధన చేస్తూ ఆరోగ్యంగా ఉంటున్నామని వారు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, జడ్చర్ల పట్టణం**

దంత వైద్యం.. సేవలకు దూరం



మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మూడేళ్ల కిందట రూ.5 లక్షలు వెచ్చించి దంత చికిత్స యంత్రాన్ని ఏర్పాటు చేశారు. రెండేళ్లు వైద్య సేవలు అందించారు. గతంలో పని చేసిన దంత వైద్యుడు బదిలీపై వెళ్లడంతో పరికరాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టిపెడితే.. వైద్యసేవలు మళ్లీ ప్రారంభం అవుతాయనడంలో సందేహం లేదు. **- న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం**

ఆర్టీసీ వైపే మహిళల చూపు



నాగర్‌కర్నూల్: ప్రయాణ ప్రాంగణంలో బస్సు ఎక్కడానికి సిద్ధమవుతున్న మహిళలు

కందనూలు, కల్వకుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన తర్వాత పల్లె వెలుగులు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మహిళా ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్నాయి. వివిధ గ్రామాలకు, పట్టణాలకు వెళ్లడానికి ఆలస్యమైనా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రయాణ ప్రాంగణానికి బస్సు వచ్చిన రెండు, మూడు నిమిషాల్లోనే సీట్లు పూర్తిగా నిండిపోతున్నాయి. ఇందులో ఎక్కువ శాతం మహిళా ప్రయాణికులే ఉంటున్నారని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభం కాకముందు ఉమ్మడి పాలమూరు రీజియన్ పరిధిలో మొత్తం ప్రయాణికుల సంఖ్య సగటున రోజుకు 1.55 లక్షలు ఉండగా.. పథకం అమలయ్యాక 2.90 లక్షలకు పైగా చేరిందని, అందులో 1.70 లక్షలకు పైగా మహిళలే ఉంటున్నారని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రారంభించిన తర్వాత 2023 ఏడాది డిసెంబరు 9 నుంచి ప్రస్తుత ఏడాది మే 20 వరకు దాదాపుగా 894 రోజులను పరిశీలిస్తే ఉమ్మడి జిల్లా పరిధిలో 2172.27 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించినట్లు అధికారులు ప్రకటించిన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

రూ.752.06 కోట్ల ఆదాయం

ఉమ్మడి పాలమూరు రీజియన్ పరిధిలో ఆర్టీసీ డిపోలకు మహాలక్ష్మి పథకం ద్వారా 2023 సంవత్సరం డిసెంబరు 9 నుంచి ప్రస్తుత ఏడాది మే 20 వరకు ఛార్జీల రూపంలో రూ. 752.06 కోట్ల మేర ఆదాయం వచ్చింది. ఇందులో మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 650.21 లక్షల మంది మహిళలు ప్రయాణించడంతో రూ.225.53 కోట్లు, నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ డిపోల పరిధిలో 631.09 లక్షల మంది ప్రయాణించడంతో రూ.218.20 కోట్లు వచ్చాయి. నారాయణపేట జిల్లా పరిధిలో 301.16 లక్షల మందికి రూ.104.39 కోట్లు, జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలో 280.84 లక్షల మందికి రూ.96.97 కోట్లు, వనపర్తి జిల్లా పరిధిలో 308.97 లక్షల మంది మహిళల వల్ల రూ.106.98 కోట్లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి రీజియన్ పరిధిలో మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కువ శాతం మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించగా.. తర్వాత స్థానంలో నాగర్‌కర్నూల్ జిల్లా నిలిచింది.



అలంపూర్, న్యూస్‌టుడే: అలంపూర్ బాలబ్రహ్మేశ్వరాలయం ఉదయం 6.00 గంటలకు, జోగులాంబ అమ్మవారి ఆలయం ఉదయం 6.30 గంటలకు తెరుస్తారు. స్వామివారి ఆలయంలో ఉదయం 7.30 నుంచి 11 గంటల వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు నివేదన, మహా మంగళహారతి ఉంటాయి. మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు ఆలయాలు మూసివేస్తారు. తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు అభిషేకం, అర్చనలు, స్పర్శ దర్శనం, సాయంత్రం ఆరు గంటలకు స్వామివారి ఆలయంలో రథోత్సవం, రాత్రి 7.30 గంటలకు మహా మంగళహారతి, జోగులాంబ ఆలయంలో ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు త్రిశతి అర్చన, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఖడ్గమాల అర్చనలు కొనసాగుతాయి. రాత్రి 7 గంటలకు మహా మంగళహారతి అనంతరం రాత్రి 8.30 గంటలకు ఆలయాలు మూసివేస్తారు.

నాట్య మయూరాలు

కూచిపూడిలో రాణిస్తూ.. శిక్షణనిస్తున్న మహిళలు

జడ్చర్ల పట్టణం, వనపర్తి, న్యూస్‌టుడే: కూచిపూడి నృత్యమంటే చిన్నప్పటి నుంచి ఇష్టం. ఈ రంగంలో భవిష్యత్తులో రాణించేందుకు శిక్షణ తీసుకుని పట్టు సాధించారు. పలు వేదికలపై ప్రదర్శనలిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు. అంతటితో ఆగిపోకుండా చిన్నారులకు శిక్షణ ఇస్తూ కళాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నాట్యకారిణులను 'న్యూస్‌టుడే' పలకరించింది.



వెయ్యి మందికి శిక్షణ

మాది వనపర్తి పట్టణం. జడ్చర్లలో ఉంటున్నా. గురువు వద్ద శిక్షణ తీసుకున్నా. కూచిపూడిలో సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమా, తెలుగు విశ్వవిద్యాలయంలో ఎంఏ కూచిపూడి కోర్సు పూర్తి చేశా. 80కి పైగా ప్రదర్శనలిచ్చి బహుమతులు పొందా. 'సాయికృప కూచిపూడి కళాక్షేత్రం' ఆధ్వర్యంలో 13 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్నా. వెయ్యి మంది చిన్నారులను తీర్చిదిద్దాను. వీరు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శనలిచ్చి ప్రతిభ కనబరుస్తున్నారు. నృత్యంతో పాటు శ్లోకాలు, ముద్రలు, తాళాలు, పాటలు నేర్పిస్తున్నా. నాకు నాట్య మయూరి, నాట్యశ్రీ, నృత్య ప్రతిభ కళారత్న, నాట్యహంస, నాట్య మంజీరా పురస్కారాలు దక్కాయి. సర్కారు పాఠశాలల విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నా. **- పడాల బిందుమాధవి**



25 ప్రదర్శనలిచ్చా..

జడ్చర్ల వెంకటేశ్వరకాలనీ మాది. అమ్మానాన్న ఆరేళ్లు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. కర్ణాటక సంగీతంలో సర్టిఫికెట్ కోర్సు చేస్తున్నా. దేవస్థానాలు, వివిధ వేదికల్లో నిర్వహించిన రాష్ట్ర, జాతీయ స్థాయి నృత్య ప్రదర్శనల్లో బహుమతులు సాధించా. 25 నృత్య ప్రదర్శనలిచ్చా. అమెరికా, దుబాయ్, ఆస్ట్రేలియాలో చిన్నారులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నా. ఏడాది కిందట 'కృష్ణ తరంగిణి నృత్యాలయం' ఏర్పాటు చేశా. వంద మంది పిల్లలకు శిక్షణ ఇస్తున్నా. వీరు మంచి ప్రదర్శనలు ఇస్తున్నారు. కళాకార్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించా. మయూరి నర్తకి, నంది పురస్కారాలు అందుకున్నా. కూచిపూడి నృత్యంలో మరింత రాణించడమే నా లక్ష్యం. **- చిగుళ్లపల్లి సంధ్య**

తరగతి గది.. విజ్ఞాన నిధి

వినూత్నంగా బోధిస్తున్న ఉపాధ్యాయినులు





పాలమూరు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయినులు తరగతి గదిలో నాలుగు గోడల మధ్య దేశ భవితను నిర్మిస్తున్నారు. నల్లపలక వంటి మెదడులో విజ్ఞానమనే అక్షరాలు దిద్ది, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారు. విద్యార్థుల జీవితాల్లో విజ్ఞాన కాంతులు వెదజల్లుతున్నారు. బోధనోపకరణాలతో వినూత్నంగా బోధిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నారు.

ఆకర్షించేలా.. అన్వేషించేలా.. : మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ బేసిక్ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని **వి.స్వప్న** సులువైన మార్గాలతో విద్యార్థులకు వినూత్నంగా బోధిస్తున్నారు. పాఠ్యాంశాలను ఆకర్షించేలా, అన్వేషించేలా, వివరించేలా, విస్తరించేలా, మదింపు చేసేలా.. ఇలా పది సార్వత్రిక టీఎల్ఎం బోధనా పద్ధతులను బోధనకు వినియోగిస్తున్నారు. ఆటల ద్వారా, గ్రూప్ యాక్టివిటీ, ప్రశ్నల పెట్టె, రియల్ లైఫ్ లింక్, మల్టీ సెన్సార్, లో కాస్ట్-నో కాస్ట్, డిజిటల్ విధానాల్లో బోధిస్తూ విద్యార్థుల మన్ననలు అందుకుంటున్నారు.



భయం పోగొట్టి..: బాలానగర్ మండలం పెద్దరేవల్లి ఎంపీపీ పాఠశాల ఎస్జీటీ ఉపాధ్యాయిని **పాలాది శ్రీవాణి** తనదైన శైలిలో బోధిస్తున్నారు. 16 ఏళ్ల నుంచి ఆంగ్లంలో విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి శిక్షణ ఇస్తున్నారు. ఆంగ్లంపై ఉన్న భయాన్ని పోగొట్టి. టీఎల్ఎంతో కథలను అనుసంధానించి బోధిస్తున్నారు. ఆంగ్లంలో మాట్లాడేలా చేస్తున్నారు. ప్రత్యేకంగా బ్రిడ్జింగ్ గ్యాప్ యాక్టివిటీతో విద్యార్థుల్లో లెర్నింగ్ గ్యాప్‌ను తగ్గిస్తున్నారు. బోధనలో ఆమె చొరవ రాష్ట్ర స్థాయిలో రిసోర్స్‌పర్సన్‌గా నిలబెట్టాయి. పూర్వ ప్రాథమిక విద్య కరికులం డెవలపర్‌గా తన వంతు పాత్ర పోషిస్తున్నారు.



దృశ్య ప్రధానంగా..: మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ (జీవశాస్త్రం) **సి.అరుణమ్మ** విద్యార్థులకు సహజ పద్ధతిలో బోధిస్తున్నారు. ఆయా పాఠ్యాంశాలు బోధించడం కంటే దృశ్య ప్రధానంగా చేసి చూపడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. పాఠాలకు అనుగుణంగా టీఎల్ఎంలను తయారు చేసి విద్యార్థులకు చూపుతూ బోధిస్తున్నారు. వెనకబడిన విద్యార్థులు సైతం అర్థం చేసుకుంటున్నారు. తడబాటు లేకుండా పరీక్షల్లో సమాధానాలు రాసి మంచి మార్కులు తెచ్చుకుంటున్నారు.

విద్యార్థులే గురువులు.. నాయకులు : కోయిలకొండ మండలం పారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ **ఎ.వంశీలత** చిన్నారులకు ఆంగ్లంలో వినూత్నంగా బోధిస్తున్నారు. పనిచేస్తూ నేర్చుకోవడం అనే పద్ధతి ఆధారంగా లిటిల్ టీచర్-లిటిల్ లీడర్ అనే భావనతో విద్యార్థులే చిన్న ఉపాధ్యాయులుగా, చిన్న నాయకులుగా మారి సహచరులకు పాఠ్యాంశాలను వివరించేలా ప్రోత్సహిస్తున్నారు. దీని ద్వారా విద్యార్థుల్లో చదవడం అలవాటు చేయడంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెరిగి నాయకత్వ లక్షణాలు వృద్ధి చెందుతాయి. వారిలో ఆత్మవిశ్వాసం పెంచి.. ప్రతి విద్యార్థిని అభ్యసన ప్రక్రియలో చురుకైన భాగస్వామిగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారు.

దాతలు నిర్మించినా.. నిరుపయోగమే



తాళం వేసిన మరుగుదొడ్లు, మూత్రశాలలు

జడ్చర్ల న్యూటౌన్, న్యూస్‌టుడే: మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కానీ మిడ్జిల్ మండలం వస్పుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవి ఉన్నా వినియోగించని దుస్థితి. ఈ బడి పీఎంశ్రీ పథకం కింద ఎంపికైంది. కానీ వసతులు మాత్రం మెరుగుపడలేదు. 240 మంది విద్యార్థులు చదువుతున్నా కనీస సౌకర్యాలు లేవు. దీంతో గతేడాది ఓ స్వచ్ఛంద సంస్థ రూ.లక్షలు ఖర్చు చేసి మూత్రశాలలు, మరుగుదొడ్లు, చేతులు కడుక్కునేందుకు కుళాయి, తాగునీటి ట్యాంకులు నిర్మించింది. నెలలు అవుతున్నా వాటిని ప్రారంభించడం లేదు. తాళం వేసి ఉంచడంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్తున్నారు. ఇప్పటికైనా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

79 మెగావాట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు (అమరచింత), న్యూస్‌టుడే : జూరాల ప్రాజెక్టుకు కర్ణాటక నుంచి వరద రావడంతో ఆదివారం రెండు టర్బయిన్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టారు. ఎగువన ఒకటి, దిగువన ఒక టర్బయిన్‌లో 79 మెగావాట్ల ఉత్పత్తి జరిగిందని ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. పవర్ హౌస్ ద్వారా 5075 క్యూసెక్కుల నీరు వదులుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సుమతి ఆశయాలు కొనసాగిద్దాం



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి

మహబూబ్‌నగర్ నగరం, న్యూస్‌టుడే: సీపీఐ నాయకురాలు సుమతి ఆశయాలను కొనసాగిద్దామని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి పేర్కొన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సుమతి సంతాప సభలో ఆమె ప్రసంగించారు. సుమతి విద్యార్థి దశ నుంచే అభ్యుదయ భావాలతో పనిచేసి, కులాంతర వివాహం చేసుకుని ఆదర్శంగా నిలిచారని తెలిపారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా అనేక పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. సుమతి భర్త రాజ్యసభ మాజీ సభ్యుడు మధు, కుమార్తె డా.ప్రతిభ, అల్లుడు డా.మధుసూదన్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, బాబురావు, వెంకటేశ్వరరావు, సాగర్, జంగారెడ్డి, మురళీకృష్ణ, వెంకట్రాములు, భూపాల్, శివప్రసాద్, శ్రీమన్నారాయణ, ఆచార్య ప్రసాదరావు, శివప్రసాద్, రాంరెడ్డి, గోపాల్, కురుమూర్తి పాల్గొన్నారు.

అనుమానంతో మహిళ దారుణ హత్య

కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

రాజాపూర్, న్యూస్‌టుడే: రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ సమీపంలో మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 18న జరిగిన ఈ ఘటనలో నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఆదివారం రాజాపూర్ ఠాణాలో విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రాజ్‌గఢ్ జిల్లా కచికేడికి చెందిన చోటేఖాన్ లారీ డ్రైవర్. మూడేళ్ల కిందట లారీ నడుపుతుండగా.. షాద్‌నగర్‌లో మహిళ పరిచయమైంది. ఆమె రెండేళ్ల కిందట లాలీ(35) అనే మహిళను చోటేఖాన్‌కు పరిచయం చేసింది. వనపర్తి జిల్లా ఏదుల మండలం సింగాయపల్లితండాకు చెందిన లాలీకి భర్త, ఇద్దరు పిల్లలున్నా బాలానగర్‌లోని అద్దె ఇంట్లో ఒంటరిగా ఉంటున్నారు.

పరిచయం ప్రేమగా మారి..: చోటేఖాన్, లాలీ పరిచయం ప్రేమగా మారింది. ఇద్దరు కలిసి మద్యం తాగేవారు. లాలీ బాలానగర్‌లో లారీ ఎక్కి చోటేఖాన్‌తో కలిసి బెంగళూరు, నాగ్‌పూర్, తమిళనాడుకు వెళ్లేవారు. అయితే ఆమె వేరే వ్యక్తులతో శారీరక సంబంధం పెట్టుకుందనే అనుమానంతో చోటేఖాన్ పలుమార్లు మందలించాడు. అతడి భార్య కూడా చనిపోవడంతో లాలీని పెళ్లి చేసుకొని, స్వగ్రామంలో ఉండేందుకు నిర్ణయించుకున్నాడు. ఈ విషయం ఆమెకు చెప్పినా చూద్దాంలే అని బదులిచ్చేవారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య చాలాసార్లు గొడవలు జరిగాయి.

అంతమొందించాడిలా...: చోటేఖాన్ లారీతో ఈ నెల 15న కేరళ నుంచి హరియాణాకు బయలుదేరాడు. మార్గంమధ్యలో ఆరు మద్యం సీసాలు కొనుగోలు చేశాడు. 18న బాలానగర్ సమీపంలోని ఓ పంక్చర్ దుకాణం దగ్గర లారీ ఆపి, లాలీకి ఫోన్ చేశాడు. హరియాణకు వెళ్తున్నానని, రావాలని కోరగా.. మరో లారీ వద్ద ఉన్నానని, ఐదు నిమిషాలు ఆగాలని ఆమె సమాధానమిచ్చారు. అనుమానం వచ్చి ఆమె ఉన్న చోటకు వెళ్లగా.. వేరే వ్యక్తులతో కనిపించారు. దీంతో ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. అదే రోజు అర్ధరాత్రి ఆమెను లారీలో ఎక్కించుకున్నాడు. ఎందుకు మోసం చేశావని గొడవ పెట్టుకున్నాడు. అప్పటికే తాగిన మత్తులో ఉన్న చోటేఖాన్ క్షణికావేశంలో కూరగాయల కత్తితో ఆమె గొంతుపై పొడిచాడు. చనిపోయిందని నిర్ధారించుకొని మృతదేహాన్ని దుప్పటిలో చుట్టి, రాజాపూర్ మండలం రంగారెడ్డిగూడ సమీపంలో రహదారి పక్కన పడేశాడు. అనంతరం లారీతో బెంగళూరు వైపు పారిపోయాడు. 19న స్థానికుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అద్దె గదిలో సిమ్‌కార్డు, కాల్ రికార్డు, సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసును 10 రోజుల్లోనే ఛేదించిన జడ్చర్ల గ్రామీణ సీఐ మహేశ్, రాజాపూర్ ఎస్సై రాజశేఖర్, సిబ్బందిని అభినందించారు.

ప్రశాంతంగా నీట్ పీజీ

354 మంది అభ్యర్థుల హాజరు



ఫాతిమా విద్యాలయం కేంద్రం వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

పాలమూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన నీట్ పీజీ అర్హత పరీక్ష -2026 ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం ఉదయం స్థానిక క్రిస్టియన్‌పల్లిలోని ఫాతిమా విద్యాలయం, ధర్మాపూర్ వద్ద ఉన్న జయప్రకాశ్ ఇంజినీరింగ్ కళాశాలలో నీట్ పీజీ పరీక్ష సజావుగా సాగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ పరీక్షకు 360 మంది అభ్యర్థులకు 354 మంది (99 శాతం) హాజరయ్యారు. ఫాతిమా విద్యాలయంలో 180 మందికి 178 మంది, జయప్రకాశ్ ఇంజినీరింగ్ కళాశాలలో 180 మందికి 176 మంది హాజరయ్యారు. ఆరుగురు మాత్రమే గైర్హాజరయ్యారు. పరీక్షలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పరిశీలించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన జీపీవోల సేవలను ఆరా తీశారు.

పోలీస్ బందోబస్తు: పరీక్ష కేంద్రాలకు పోలీస్ శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. కేంద్రాలను ఎస్పీ డి.జానకి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బందోబస్తును స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, గ్రామీణ సీఐ గాంధీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



వీరస్వామి

వీపనగండ్ల, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఓ యువకుడు మరణించాడు. ఆదివారం రాత్రి వీపనగండ్ల-వెలగొండ మధ్య జరిగింది. పెబ్బేరు మండలం యాపర్లకు చెందిన పంచాయతీ వర్కర్ వీరస్వామి(38) చిన్నంబావి మండలం దగడపల్లిలో జరిగిన శుభకార్యానికి వెళ్లి ఆదివారం రాత్రి స్వగ్రామానికి వస్తుండగా.. ద్విచక్ర వాహనం అదుపు తప్పి వెలగొండ సమీపంలో ఓ చెట్టును ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన వీరస్వామి గుర్తించి దారిన వెళ్లే వారు 108కు సమాచారమిచ్చారు. క్షతగాత్రున్ని వీపనగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈయనకు భార్య జోత్స్న, కుమార్తె ఉన్నారు.

సాంకేతికత తోడుగా.. భద్రత మెండుగా

ఏటీఆర్ సంరక్షణకు డ్రోన్ల వినియోగం



అడవిలో చెట్లకు కెమెరాలు బిగిస్తున్న సిబ్బంది

అమ్రాబాద్, న్యూస్‌టుడే: అమ్రాబాద్ పెద్దపులుల అభయారణ్యం(ఏటీఆర్) పరిరక్షణ ఆధునిక సాంకేతికత వినియోగంతో మరింత పటిష్ఠంగా మారింది. వన్యప్రాణులు, అరుదైన వృక్ష జాతులు, విలువైన కలపకు నిలయమైన నల్లమల పరిరక్షణకు వాచర్లు, ఎఫ్‌బీవోలు, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్ఆర్వోలు నడుం బిగించారు. ప్రతి ప్రాంతాన్ని సిబ్బంది నిరంతరం ప్రత్యక్షంగా పర్యవేక్షించడం సాధ్యం కాకపోవటంతో కీలకమైన సాంకేతికతను ఆసరాగా చేసుకుంటున్నారు. అధికారుల కళ్లుగప్పి అక్రమాలకు పాల్పడుతున్న వేటగాళ్లు, స్మగ్లర్లు, ఆక్రమణదారుల ఆగడాలను అరికట్టేందుకు అధికారులు కెమెరాలు, డ్రోన్లు, ఈ-సర్వైలెన్స్ కెమెరాలు వినియోగిస్తూ అక్రమాలకు అడ్డుకట్ట వేస్తున్నారు.

వన్యప్రాణులు, వేటగాళ్ల కదలికలపై నిఘా: అడవి 2,611 చదరపు కి.మీ. మేర విస్తరించి ఉంది. అడవిలో జంతువులు తరచూ సంచరించే ప్రదేశాలు, మార్గాలు, నీటి వనరుల వద్ద, పులులు వన్యప్రాణులను చంపిన ప్రదేశాల్లో సిబ్బంది కెమెరాలను చెట్లపై నేలకు అడుగున్నర ఎత్తులో బిగిస్తారు. పులులు, ఎలుగుబంట్లు, ఇతర వన్యప్రాణులు కెమెరాల ఎదుట నుంచి వెళ్లినపుడు వాటి కదలికలను పసిగట్టి చిత్రాలను రికార్డు చేస్తాయి. దీంతో అడవిలోని వన్యప్రాణుల సంచారంపై సమాచారం తెలుస్తుంది. అడవిలోకి అక్రమంగా ప్రవేశించే వేటగాళ్లు, స్మగ్లర్లు, అటవీ ఆక్రమణదారుల చిత్రాలు కెమెరాల్లో రికార్డవుతాయి. గతంలో మద్దిమడుగు రేంజ్, అచ్చంపేట రేంజ్‌లలో వేటగాళ్లు జంతువులను వేటాడి మాంసాన్ని తీసుకెళ్తూ కెమెరాలకు చిక్కారు. వీటి ఆధారంగా నిందితులను గుర్తించి కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. కెమెరాలో నిక్షిప్తమైన చిత్రాలను డేటాబేస్‌లో నిల్వ చేస్తారు.

డ్రోన్లతో పరిశీలన

ఏటీఆర్‌లో మనుషులు చేరుకోలేని లోయలు, ఎత్తైన కొండ ప్రాంతాలను పరిశీలించేందుకు రెండు అధునాతన డ్రోన్లను వినియోగిస్తున్నారు. అటవీ ఆక్రమణలు, కలప నరికివేత, మానవ సంచారం, అగ్నిప్రమాదాల సమాచారాన్ని తెలుసుకునేందుకు డ్రోన్లు సహాయపడుతున్నాయి. వీటితో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణాన్ని పరిశీలించే అవకాశం ఉంటుంది. వేసవిలో అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్న సందర్భాల్లో మంటల వ్యాప్తి నిరోధానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. అత్యాధునిక డ్రోన్లు 10 కి.మీ. విస్తీర్ణంలోనూ చిత్రాలను చిత్రీకరిస్తాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

పేట పట్టణం : 9441816587 మక్తల్ గ్రామీణం : 7680923728
ధన్వాడ : 8008573834 దామరగిద్ద : 8008573836

?: దామరగిద్ద సంజీవరాయ ఆలయం వద్ద వేసిన బోరులో నీరు పుష్కలంగా ఉంది. విద్యుత్తు మోటర్ మంజూరైంది. ఈ బోరు నీటిని పక్కనే నిరుపయోగంగా ఉన్న నీటిశుద్ధి కేంద్రం ద్వారా శుద్ధజలం అందించాలి. - **కె.బసిరెడ్డి, దామరగిద్ద,** ✔: నీటిశుద్ధి కేంద్రాన్ని ఉపయోగంలోకి తేవడానికి చర్యలు తీసుకుంటాం. - **సాయిలక్ష్మి, ఎంపీడీవో దామరగిద్ద,** ?: దామరగిద్దలో సంజీవరాయ ఆలయం మరమ్మతుకు రూ.12 లక్షలు మంజూరై రెండేళ్లు దాటింది. వెంటనే పనులు చేపట్టి పూర్తి చేయాలి. - **టి.వెంకట్రాములు, దామరగిద్ద,** ✔: దామరగిద్దలో సంజీవరాయ ఆలయం మరమ్మతు పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. స్థానిక నాయకులతో మాట్లాడి పనులు చేయించేలా చర్యలు తీసుకుంటా. - **ఏఈ రమేష్**

?: దామరగిద్ద-యానగుంది ఆర్అండ్‌బీ రోడ్డుకు కాన్కుర్తి విపరీతమైన మలుపులతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. - **సురేష్‌రెడ్డి, కాన్‌కుర్తి,** ✔: ఈ ఆర్అండ్‌బీ రోడ్డుకు అవసరమైన చోట మలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయిస్తాం. - **బాల్‌రాజ్ ఏఈ, ఆర్అండ్‌బీ నారాయణపేట,** ?: దామరగిద్ద హైస్కూల్ పాఠశాలకు గతంలో ఏర్పాటు చేసిన గేటు ఊడిపోయింది. మళ్లీ గేటు ఏర్పాటు చేయాలి. - **ఎం.నారాయణ, దామరగిద్ద**

✔: దామరగిద్ద పాఠశాలకు గేటు వెంటనే ఏర్పాటు చేసి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. - **రఘునందన్, ఏఈ దామరగిద్ద** ?: దామరగిద్దలో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరైనా కాలువల నిర్మాణం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. - **యు.భీంషప్ప, దామరగిద్ద**

✔: దామరగిద్దలో మురుగు కాలువల నిర్మాణానికి టెండర్ తీసుకున్న గుత్తేదారు ముందుకు రాక పనులు మొదలు కాలేదు. గుత్తేదారుతో మాట్లాడి పనులు చేయిస్తా. - **రమేష్, పీఆర్ ఏఈ దామరగిద్ద** ?: దామరగిద్ద గ్రామ పంచాయతీ ఏరియాలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఉన్నప్పటికీ కొన్ని ఇళ్ల నల్లాల నీరు, మురుగు నిత్యం రోడ్డుపై ప్రవహిస్తోంది. నడవడానికి ఇబ్బంది ఏర్పడుతోంది. - **సత్తి సైదప్ప, దామరగిద్ద** ✔: దామరగిద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీటిని అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో కలిపేందుకు తగు చర్యలు తీసుకుంటాం. - **కన్కిరెడ్డి, సర్పంచి దామరగిద్ద** - **న్యూస్‌టుడే, దామరగిద్ద**

?: రుద్రసముద్రంలో డ్రైనేజీలు లేక మురుగు ఇళ్ల మధ్య నిలుస్తోంది. - **ఆంజనేయులు, రుద్రసముద్రం**

✔: కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేస్తాం. - **రమేష్, ఎంపీడీవో, మక్తల్,** ?: కాచ్‌వార్ గ్రామంలో విద్యుత్తు ఉప కేంద్రం ఏర్పాటు చేసి అంతరాయం సమస్య పరిష్కరించాలి. - **అశోక్‌రెడ్డి, కాచ్‌వార్,** ✔: నూతన విద్యుత్తు ఉప కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది. - **వెంకటేష్, ఏఈ, మక్తల్**

?: బొందల్‌కుంటలోని పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి. - **రమేష్, బొందల్‌కుంట,** ✔: మండలంలో పాఠశాలలకు సంబంధించి ప్రహరీల కోసం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. - **అమీరొద్దీన్, ఎంఈవో, మక్తల్,** ?: మండలంలోని భూత్పూర్ శివారులో మూలమలుపు ప్రమాదకరంగా ఉంది. - **రాజు, భూత్పూర్,** ✔: వేగ నిరోధకాలు, సూచికలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. - **అభిలాష్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఏఈ, మక్తల్**

- **మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే**

దొడ్డు బియ్యం.. వేలానికి సిద్ధం

- సెప్టెంబరు 2 వరకు టెండర్ల గడువు
- నిల్వలు పరిశీలిస్తున్న అధికారులు



అయిజ గోదాంలో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం బస్తాలు

అయిజ, న్యూస్‌టుడే: రేషన్ దుకాణాలు, స్టేజి-1, స్టేజి-2 గోదాముల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని వేలం వేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు ఎంత మేర నిల్వలు ఉన్నాయనేది ఉన్నతాధికారులకు పంపించారు. వారు తాజాగా పరిశీలించి వేలం వేసేందుకు చర్యలు చేపట్టారు. మొన్నటి వరకు దొడ్డు బియ్యం ముక్కిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తాయి. మొదట్లో దొడ్డు బియ్యం నిల్వలపై ప్రత్యేక దృష్టి పెట్టి అనంతరం మరిచారు. గతంలో వీటిని వేలం వేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ రెండుసార్లు నిర్ణయం తీసుకొని వెనక్కి తగ్గారు. ఉమ్మడి జిల్లాలో 2,027 రేషన్ దుకాణాలు ఉన్నాయి. గోదాములు, చౌకధర దుకాణాల్లో కలిపి 45,656 క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

జిల్లా	దుకాణాలు	రేషన్ కార్డులు
గద్వాల	355	1,85,658
మహబూబ్‌నగర్	506	2,72,821
నాగర్‌కర్నూల్	558	2,72,487
నారాయణపేట	301	1,66,838
వనపర్తి	327	1,79,204

కిలో రూ.21.65 ధర..: దొడ్డు బియ్యానికి అధికారులు కిలో రూ.21.65 ధర నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాల వారీగా ఎంతమేర నిల్వలు ఉంటే అంత వరకు టెండర్‌దారులు ప్రభుత్వానికి డబ్బులు చెల్లించాలి. ఈ నెల 28 నుంచి సెప్టెంబరు 2 వరకు ఆన్‌లైన్‌లో టెండర్లు వేసుకునే అవకాశం కల్పించారు. టెండర్లలో కనీస ధర కంటే ఎక్కువ నమోదు చేసిన వారికి అవకాశం కల్పిస్తారు. ఈ మేరకు డీలర్లకు దుకాణాల వారీగా నిల్వల వివరాల జాబితాను పంపనున్నారు. దీని ఆధారంగానే వారు నిల్వలు చూపాలి. లేనిపక్షంలో టెండర్ దాఖలు చేసిన ధర ప్రకారం డీలర్లు డబ్బులు చెల్లించాలి. ప్రస్తుతం అధికారులు గోదాముల్లో నిల్వలను పరిశీలిస్తుండగా డీలర్లు తరుగుపై ఆలోచిస్తున్నారు. 50 కిలోల బస్తా 16 నెలలుగా నిల్వ ఉంచితే కనీసం తరుగు వస్తుందని, దీన్ని ఎవరు భరిస్తారని ప్రశ్నిస్తున్నారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం..



దామరగిద్ద మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కొడ్లి గుండప్ప కుమారుడు కొడ్లి వినోద్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు. వినోద్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. స్థానిక సీపీఎస్ పాఠశాలలో గదుల కొరతను దృష్టిలో ఉంచుకొని తమ స్నేహితుడి జ్ఞాపకార్థం అసంపూర్తిగా ఉన్న గదిని రూ.లక్షకు పైగా వెచ్చించి పూర్తి చేయిస్తున్నారు. నెలపై బండలు, గదులకు కిటికీలు, తలుపులు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు. పనులు పూర్తయితే గదుల కొరత తీరుతుందని పాఠశాల హెచ్‌ఎం చందు జమాన్ తెలిపారు. - **న్యూస్‌టుడే, దామరగిద్ద**

ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలి



ఉత్సవాల్లో సేవా సమితి సభ్యులు, మహిళలు

నారాయణపేట, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని విద్వాన్ అనిల్ దేశాయి అన్నారు. నారాయణపేటలోని రాఘవేంద్ర స్వామి ఆలయంలో ఆదివారం మధ్యారాధన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్వామికి సుప్రభాతం, అభిషేకం, పుష్పాలంకరణ, మహా నైవేద్యం, భజన పల్లకీసేవ, హరిదాసు సంకీర్తనలతో గోపాల కార్యక్రమం, విశేష పూజలు చేశారు. విద్వాన్ అనిల్ దేశాయి మాట్లాడుతూ రాఘవేంద్రస్వామి మహిమలు అపారమన్నారు. కొలిచే వారికి కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారన్నారు. దైవచింతన అలవర్చుకోవాలని, స్వామి వారి సేవలో తరించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నరసింహాచారి, రఘుప్రేమ్‌జోషి, భీంసేన్‌రావు, సీతారామారావు, గోపినాథ్, శేషు, మంజునాథ్ జోషి, సేవా సమితి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం వైపు యువత దృష్టి



మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి



అలరించిన లేజర్‌షో

అలంపూర్, న్యూస్‌టుడే: యువత ఆధ్యాత్మికం వైపు దృష్టి పెట్టారని, ఎక్కడ చూసినా ఆలయాల్లో యువత సందడే కనిపిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం అలంపూర్ ఆలయాల వద్ద రూ.4.60 కోట్లతో చేపట్టిన మల్టీమీడియా, సౌండ్ లైట్స్ షోను ఎంపీలు మల్లు రవి, డీకే అరుణ, స్థానిక ఎమ్మెల్యే విజయుడుతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. అలంపూర్ ఆలయాల అభివృద్ధిపై ఇప్పటికే చాలా నిర్లక్ష్యం జరిగిందని, రాబోయే రోజుల్లో అభివృద్ధికి అందరి సహాయ సహకారాలు ఉండాలని కోరారు. ఆలయాల దర్శనానికి వస్తే క్రమశిక్షణ, పెద్దలను గౌరవించే విధానం తెలుస్తుందన్నారు. ఎంపీలు అరుణ, మల్లు రవి మాట్లాడుతూ.. అలంపూర్ ఆలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. రోడ్ల కోసం రూ.300 కోట్ల మేరకు డీపీఆర్ పంపించినట్లు మల్లు రవి పేర్కొన్నారు. ప్రధానంగా నాగర్‌కర్నూల్ ప్రాంతానికి రైల్వే లేకపోవడంతో చాలా వెనకబడిందని ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రోజూ రాత్రి 7 గంటలకు తిరిగి 7.45 గంటలకు రెండు పర్యాయాలు 25 నిమిషాల చొప్పున లేజర్ షో ఉంటుందని అధికారులు వెల్లడించారు. యూత్ అడ్వాన్స్‌మెంట్ టూరిజం అండ్ కల్చర్ శాఖ స్పెషల్ సెక్రటరీ వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం..

ధన్వాడ, మరికల్ కూడలి, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని టీపీసీసీ సభ్యుడు చిట్టెం అభిజయ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మరికల్, ధన్వాడ మండలం ఏమ్నోన్‌పల్లి, ధన్వాడలో పలు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన వారు వెంటనే పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలో టార్గెట్‌ను తొందరగా చేరుకుంటే మరిన్ని ఎక్కువ కొత్త ఇళ్లు అడిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు సూర్య మోహన్‌రెడ్డి, చిట్టెం మాధవరెడ్డి, చెన్నయ్య, నాగేష్, బాల నర్సిములు, లక్ష్మయ్యగౌడ్, రాఘవేందర్‌రెడ్డి, వగ్గు రాజు, రాజేష్‌గౌడ్, రహ్మాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నర్వ, న్యూస్‌టుడే: నర్వ మండలం రాయికోడ్, నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ ప్రారంభించారు. ఎద్దుల గంగమ్మ, ముత్త భారతి దంపతులకు ప్రభుత్వం తరుపున బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి శశికళ, భాగ్యమ్మ, నాయకులు డి.కృష్ణారెడ్డి, రవి, చంద్రశేఖర్, రాజారెడ్డి, సత్యారెడ్డి, నారాయణరెడ్డి, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

క్వారీలు, క్రషర్ల పనులు నిలిపివేయాలి

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే: మక్తల్ మండలంలోని గుడిగండ్ల గుట్టకు క్వారీలు, క్రషర్ల ఏర్పాటు పనులు నిలిపివేయాలని పుడమి ఫౌండేషన్ ఛైర్మన్ వెంకటపతి రాజు పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. భారత్‌మాల రోడ్డు కోసం గుత్తేదారు గుడిగండ్ల గుట్టకు సర్వే నెం.244లో ఉన్న 31.18 ఎకరాల గుట్టకు బ్లాస్టింగ్ చేయాలని ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. గుట్టపై మిషన్ భగీరథ ట్యాంకు, చెన్నకేశవ స్వామి ఆలయం ఉందని, సమీపంలో పంట పొలాలు, పక్కనే జాతీయ రహదారి, పులిమామిడి రైల్వేస్టేషన్ ఉన్నాయన్నారు. ఈ దారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని వివరించారు.

ఎస్ఐఆర్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

నారాయణపేట, న్యూస్‌టుడే: ఎన్నికల కమిషన్ ఎస్ఐఆర్ రెండో దశ ప్రక్రియ చేపట్టిందని, నోటీసులు అందుకున్న ఓటర్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటు హక్కు కాపాడుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగంలో ఓటు వజ్రాయుధం లాంటిదని ఓటు గల్లంతు కాకుండా చూసుకోవాలన్నారు. ఆదివారం పేట డీసీసీ కార్యాలయంలో ఎస్ఐఆర్ అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నోటీసులు అందుకున్న ఓటర్లు వివరాలు పూరించి నిర్ణీత గడువులోగా బీఎల్‌వోలకు అందజేయాలన్నారు. సమావేశంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ బండి వేణుగోపాల్, జిల్లా కాంగ్రెస్ కోశాధికారి మనోహర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, డీసీసీ కార్యదర్శి వెంకట్రాములుచారి పాల్గొన్నారు.

బాహ్య మూల్యాంకన ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనం మండల వనరుల కేంద్రాల్లో చేయించడం సరైందికాదని, ఈ ఉత్తర్వులను వెంటనే ఉప సంహరించుకోవాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హైమావతి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు నాన్ డిటెన్షన్ విధానం అమలులో ఉన్నందున సమ్మెటీవ్ పరీక్షల్లో విద్యార్థుల ఫలితాల ఆధారంగా ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం సరికాదన్నారు. ఉపాధ్యాయులకు వివిధ శిక్షణలు, ప్రాజెక్టులు, రాత పనులు, ఇతర కార్యక్రమాలతో బోధన సమయం తగ్గుతుందన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో తగినంత మంది ఉపాధ్యాయులు లేకపోవడంతో అన్ని సబ్జెక్టులు బోధించాల్సి వస్తుందన్నారు. విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లో సిలబస్ పూర్తి చేయడమే కష్టంగా ఉన్నప్పుడు బాహ్య మూల్యాకనం పేరుతో ఉపాధ్యాయులను బోధనకు మరింత దూరం చేయడం విద్యార్థుల ప్రయోజనాలకు విరుద్ధమన్నారు. బాహ్య మూల్యాంకనంతో అదనపు భారం పడుతుందన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని వివిధ ప్రయోగాలతో మరింత సంక్షోభంలో నెట్టివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన సమయంలో ఇటువంటి అనవసరమైన విధానాలు ప్రవేశపెట్టడంతో విద్యార్థుల అభ్యసనపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు.

రూ.5.50 లక్షల ఎల్వోసీ అందజేత

మరికల్ కూడలి, న్యూస్‌టుడే: మరికల్ మండలం తీలేర్ గ్రామానికి చెందిన వాజిద్ అనే వ్యక్తికి రూ.5.50 లక్షల ఎల్వోసీని టీపీసీసీ సభ్యుడు అభిజయ్‌రెడ్డి ఆదివారం మరికల్‌లో అందజేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు సూర్యమోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు వీరన్న, పట్టణాధ్యక్షుడు హరీష్‌కుమార్, మరికల్ సర్పంచి చెన్నయ్య, ఉప సర్పంచి ఖాజా, ఆనంద్‌కుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడిగా కృష్ణయ్య



ధన్వాడ, న్యూస్‌టుడే: ధన్వాడ మండల భాజపా ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా కొండాపూర్‌కు చెందిన కుమ్మరి కృష్ణయ్య నియమితులయ్యారు. ఈ విషయాన్ని జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మాకం సురేందర్ ఆదివారం ధన్వాడలో వెల్లడించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి, కాంగ్రెస్ పార్టీ సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మంథన్‌గోడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను వారు ప్రారంభించారు. పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కట్ట సురేష్, సత్యారెడ్డి, పాల కృష్ణయ్య, పి.నర్సింహ, గడ్డం రమేష్, మల్లేష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

హామీల అమలుకు పోరాటం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్‌రెడ్డి

మద్దూరు, న్యూస్‌టుడే: ఇప్పటి వరకు హామీలు విన్నం ఇక వినేది లేదు.. అమలు కోసం ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడానికి పోరాటం చేయాల్సిందేనని టీఎస్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు వై.జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. టీఎస్ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం మద్దూరు జిల్లా పరిషత్తు ఉన్నత బాలికల పాఠశాలలో జిల్లా ఉపాధ్యాయులతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ స్కీమ్ పునఃరుద్ధరించాలని, గత ప్రభుత్వం తీసుకువచ్చిన 317 జీవో ద్వారా ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, నర్సింహరెడ్డి, భాస్కర్, సూర్యప్రకాష్, ఎం.రఘువీర్, సత్యనారాయణరెడ్డి, తిమ్మన్న, శేఖర్, తిరుపతిరెడ్డి, ముస్తఫా, అఖిల్, రవికుమార్, నరేష్, శ్రీనివాస్‌లు తదితరులు పాల్గొన్నారు.

తరలివచ్చిన భక్తులు.. ప్రముఖులు



బీరప్ప విగ్రహం వద్ద పూజలు చేస్తున్న డీకే అరుణ

ధన్వాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన ధన్వాడలో రూ.3 కోట్లతో పునర్నిర్మించిన కామరాతి బీరప్ప ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఇందులో పలువురు ప్రముఖులతో పాటు కుర్వ సంఘం నాయకులు హాజరయ్యారు. ధ్వజస్తంభం, నంది, గణపతి, ఏనుగులు, ద్వారా పాలకులకు సంబంధించిన విగ్రహాలను ప్రతిష్ఠించారు. 'ఏళ్ పటేల్ కోడ్‌గే' అనే నామస్మరణలతో పరిసరాలు ఆదివారం మార్మోగిపోయాయి. ఎంపీ డీకే అరుణ, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు అభిజయ్‌రెడ్డి, సర్పంచి జ్యోతి, ఉప సర్పంచి బాల నర్సిములు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలు పురస్కరించుకొని ధన్వాడ కుర్వవాడకు చెందిన ఆడపడుచులు హాజరుకావడంతో పండుగ వాతావరణం నెలకొంది. స్థానికులే కాకుండా కర్ణాటక, హైదరాబాద్, ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ద్యావరి చిన్న తమ్మప్ప, పోలమొల్ల చంద్రప్ప, కుర్వ మల్లయ్య, కటికేరి నర్సిములు, గడ్డమీది మల్లప్ప, యాద్గిరి ఎల్లప్ప, కటికేరి గడ్డెప్ప, ఏకాన నర్సిములు, బొడ్రాయి బుడ్డప్ప, పూజారి పెంటప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం, కప్‌ను అందుకుంటున్న పేట జిల్లా జట్టు

ధన్వాడ, న్యూస్‌టుడే: సుబ్రతో ముఖర్జీ రాష్ట్ర స్థాయి అండర్-17 ఫుట్‌బాల్ టోర్నీలో నారాయణపేట జట్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ జట్టులోని సభ్యులు అందరూ కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన క్రీడాకారులే కావడం విశేషమని చెప్పవచ్చు. ఈ నెల 29, 30 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీలు హైదరాబాద్‌లో జరిగాయి. నారాయణపేట జట్టు అయిదు జట్లతో పోటీ పడి మొదటి స్థానంలో నిలిచింది. బంగారు పతకాన్ని సాధించి త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీనిపై కొండాపూర్ గురుకుల ప్రిన్సిపల్ రాజారాం టీం సభ్యులతో పాటు కోచ్ రామ్మోహన్‌గౌడ్, పీఈటీ ఆంజనేయుల్ని అభినందించారు. జాతీయ స్థాయిలోనూ విజేతగా నిలిచేందుకు ఇప్పటి నుంచి సిద్ధం చేయాలని సూచించారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పేటలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

నారాయణపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. కార్మికులకు ప్రభుత్వం మగ్గాలు ఇచ్చి ముడి సరుకులు సరఫరా చేయడంలేదన్నారు. సెప్టెంబరు 9న చేనేత సమస్యలపై కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న మహాధర్నా విజయవంతానికి అఖిలపక్షం నాయకులు ఆదివారం జిల్లా కేంద్రంలోని బురుడివాడి కాలనీలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చేనేత కార్మికులకు ముడి సరుకులు ఇవ్వకపోవడంతోపాటు బ్యాంకులు రుణాలు ఇవ్వడంలేదన్నారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు బాల్‌రామ్, కెంచి నారాయణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బీఎస్‌పీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్ క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ



సన్మానం పొందిన క్రీడాకారులు తదితరులు

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే: సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎల్లమ్మకంట కొత్తగార్లపల్లి రోడ్‌లో 8-11 ఏళ్ల బాలబాలికలకు ఉమ్మడి జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. వీరిలో ప్రతిభ కనబర్చిన 36 మందిని జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తున్నట్లు సైక్లింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గోపాలం తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారికి మెడల్స్ అందించి సన్మానించారు. ఎంపికైన వీరు సెప్టెంబరు 12, 13 తేదీల్లో హైదరాబాద్ బండ్లగూడ, నాగోల్‌లో నిర్వహించే జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మణికంఠగౌడ్, శివకుమార్, ఆడమ్స్, బాల్‌రాజ్, రమేష్‌గౌడ్, గౌతమి, నరేష్‌గౌడ్, గోపి, నీలి యాదగిరి పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్‌కు అనుసంధానం



సోలార్ ప్లాంట్ వద్ద అధికారులు, నిర్వాహకులు

ధన్వాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన ధన్వాడ శివారులో రెండు మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన చిట్టెం మాధవరెడ్డి సోలార్ ప్లాంట్‌ను ఆదివారం విద్యుత్తు అధికారులు ధన్వాడ విద్యుత్తు ఉప కేంద్రానికి అనుసంధానం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్తు ఆపరేషన్ డీఈ ఎస్.రాజునాయక్ మాట్లాడుతూ అనుసంధానంతో ధన్వాడ ఉప కేంద్రం పరిధిలోని అంతరాయంలేని నాణ్యమైన విద్యుత్తు సరఫరా అందే అవకాశం ఉందన్నారు. ఏడీఈ ప్రదీప్‌కుమార్, ఏఈ ఎండీ రఫీ, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి, సిబ్బంది అచ్చుతారెడ్డి, వెంకటేష్, మన్సూర్ అలీ, సురేష్, ఖలీల్, ప్రభాకర్, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

నారాయణపేట, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని 8వ వార్డు పరిధిలోని సత్యసాయి కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం భాజపా నేతలతో కలిసి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రారంభించారు. భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రతంగ్‌పాండురెడ్డి ఎంపీ అరుణను సన్మానించారు. నారాయణపేట మండలం అంత్వార్ గ్రామ ఆత్మబోధ ఆశ్రమం వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ట్‌లైట్లను ఎంపీ ప్రారంభించారు. కొండా సత్యయాదవ్, మంజుల, రఘు రామయ్యగౌడ్, జీఆర్ రెడ్డి, రమణిక, పుష్పలత, నాయకులు పాల్గొన్నారు.

రైల్వే డబ్లింగ్‌కు 5 ఎకరాలు

దేవరకద్ర, న్యూస్‌టుడే: దేవరకద్ర పుర పరిధిలో రైల్వే డబ్లింగ్ పనులకు 5 ఎకరాల వ్యవసాయ భూమి కేటాయిస్తున్నట్లు ఆర్ఐ శరత్ తెలిపారు. ఆదివారం రైతులతో కలిసి భూములను ఆయన పరిశీలించి మాట్లాడారు. వ్యవసాయ భూమితో పాటు 1,500 గజాల ప్లాట్లను కేటాయించినట్లు చెప్పారు. ఇప్పటికే లబ్ధిదారులకు నోటీసులు అందించామన్నారు. త్వరలో పరిహారం ఇస్తామన్నారు. కార్యక్రమంలో జీపీవో రాజు పాల్గొన్నారు.

తప్పిపోయిన చిన్నారుల ఆచూకీ లభ్యం

ఊట్కూరు, న్యూస్‌టుడే: మన్యం కొండ పుణ్యక్షేత్రం దర్శించుకోవడానికి వెళ్లి దారి తప్పిన బాలల్ని గుర్తించి, తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం. . ఊట్కూరులోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన బాలలు వెంకటేశ్, సాత్విక్ 5వ తరగతి చదువుతున్నారు. ఇద్దరు మిత్రులు కావడంతో సాత్విక్ మన్యంకొండ పుణ్యక్షేత్రం దర్శించుకుందామని వెంకటేశ్‌కు చెప్పడంతో ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇద్దరు వెళ్లిపోయారు. సెలవు రోజు కావడం, తల్లిదండ్రులుగ వ్యవసాయ పనులకు వెళ్లడంతో ఎవ్వరూ గ్రహించలేదు. మన్యంకొండకు చేరుకుని అలివేలు మంగమ్మను దర్శించుకున్నారు. వెంకటేశ్ వద్ద ఉన్న డబ్బులు ఖాళీ కావడంతో ఏడ్వటం మొదలు పెట్టారు. దీంతో కాలినడకన దేవరకద్రకు చేరుకున్నారు. తెదేపా సీనియర్ నాయకుడు కుర్వ శ్రీను ఇంటి వద్ద పని చేసే వారు ఏడ్చుకుంటూ వెళ్తున్న బాలల్ని ప్రశ్నించారు. కుర్వ శ్రీనుకు అప్పగించారు. బాలలతో మాట్లాడి వివరాలు తెలుసుకుని మండల కేంద్రానికి చెందిన బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎం.భరత్‌కు సమాచారం ఇచ్చారు. సామాజిక మాధ్యమాల్లో బాలల చిత్రాలు పెట్టి, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు వెళ్లి బాలల్ని తీసుకుని వచ్చారు. తప్పిపోయిన బాలలు తిరిగి ఇంటికి చేరుకోవడంతో తల్లిదండ్రులు, ఇరు కుటుంబాల సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు.

వృద్ధుడికి గాయాలు

మరికల్ కూడలి, న్యూస్‌టుడే: మరికల్ బస్టాండ్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో మల్లారెడ్డి అనే వృద్ధుడు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. కొల్లంపల్లి గ్రామానికి చెందిన మల్లారెడ్డి, భార్యతో కలిసి సంగంబండ వెళ్లేందుకు మరికల్ బస్టాండ్‌కు వచ్చారు. రాయచూర్ బస్సు ఎక్కే క్రమంలో రద్దీ అధికంగా ఉండటంతో బస్సు వెనుక పక్కన నిల్చోగా బస్సు డ్రైవర్ రివర్స్ తీసుకుంటూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మల్లారెడ్డి కాలుకు బలమైన గాయం కాగా 108 వాహనంలో మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. మరికల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఇసుక టిప్పరు పట్టివేత

మాగనూరు, న్యూస్‌టుడే: మాగనూరు మండలం వర్కూరు శివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును ఆదివారం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్‌బాబు తెలిపారు. దాసరిపల్లి శివారులో పట్టుకున్న ట్రాక్టరును ఠాణాకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

అసంపూర్తి పనులు..



మక్తల్ మండలంలోని మంథన్‌గోడ్ పాఠశాలలో అదనపు గది నిర్మాణం, తరగతి గదుల తలుపులు, కిటికీల మరమ్మతులు తదితరం కోసం రూ.19 లక్షలు మంజూరయ్యాయి. అదనపు గది మినహా మిగతా పనులు పూర్తయ్యాయి. ఈ విషయంపై ఎంఈవో ఖాజా అమిరోద్దీన్ వివరణ కోరగా.. బిల్లుల విషయంపై కలెక్టర్, డీఈవో దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

- **న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం**

చెట్టు కొమ్మే ప్రమాద సూచిక



ఊట్కూరు మండలంలోని పులిమామిడి నుంచి బిజ్వార్ గ్రామాల మధ్య రహదారి కూరుకుపోయి, రంధ్రం ఏర్పడింది. ఈ చోట చెట్టు కొమ్మను ప్రమాద సూచికగా ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపడితేనే.. ప్రమాదాలు నివారించవచ్చు.

- **న్యూస్‌టుడే, ఊట్కూరు**